సాక్షి జగిత్యాల

గురువారం : 15 : ఫిబ్రవరి : 2024



పూజారుల మొర కరుణించేనా..?

దేవాలయాల్లో నిత్యపూజల నిర్వహణకు ప్రభుత్వం తీసుకొచ్చిన ధూప, దీప, నైవేద్య (డీడీఎన్) పథకం లక్ష్యం నీరుగారిపోతోంది. 8లో▸



అజాగ్రత్తతోనే ప్రమాదాలు

అతివేగం, అజాగ్రత్తతోనే రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ అన్నారు. 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 33.0/20.0

వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కపోత పెరుగుతుంది. సాయంత్రం చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

కొండగట్టులో జగిత్యాల డీఎస్పీ పూజలు



పూజలు చేస్తున్న డీఎస్పీ

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు అంజన్నను బుధవారం జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ దర్శించుకున్నారు. ఈవో వెంకటేశ్ ఆయనను శాలువాతో సత్కరించి తీర్థప్రసాదాలు అందించారు. ఆయన వెంట మల్యాల ఎస్సై అబ్దుల్ రహీం, ఏఎస్ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరణ

జగిత్యాలక్రైం: డీఎస్పీగా రఘుచందర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

బాధ్యతలు స్వీకరించిన కమిషనర్



కమిషనర్ మోహన్

మెట్‌పల్లి: మెట్‌పల్లి మున్సిపల్ కమిషనర్‌గా టి.మోహన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కమిషనర్‌కు సిబ్బంది స్వాగతం పలికారు. ఇక్కడ పనిచేసిన జగదీశ్వర్‌గౌడ్ రాయికల్ మున్సిపాలిటీకి బదిలీ అయిన విషయం తెలిసిందే.

పసుపు కొనుగోళ్లు ప్రారంభం



ప్రారంభమైన పసుపు కొనుగోళ్లు

మెట్‌పల్లి: మెట్‌పల్లి పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం పసుపు కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. యార్డులో కాంటాలకు వ్యాపారులు పూజలు చేసి కొనుగోళ్లను ప్రారంభించారు. మొదటిరోజు రైతుల నుంచి మొత్తం 285 క్వింటాళ్ల పసుపును కొనుగోలు చేసిన వ్యాపారులు.. పసుపు నాణ్యతను బట్టి కనిష్ట ధర క్వింటాల్‌కు రూ.8,311, గరిష్టంగా రూ.12,888 చెల్లించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు అధికారులు, వ్యాపారులు, తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ చైర్‌పర్సన్‌ను కలిసిన అధికారులు



జెడ్పీ చైర్‌పర్సన్‌తో ఎంపీడీవోలు

జగిత్యాలరూరల్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బదిలీపై వచ్చిన జిల్లా అధికారులు బుధవారం జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంతను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. జెడ్పీ సీఈవో గౌతమ్‌రెడ్డి, డీఆర్డీవో సంపత్‌రావు, అడిషనల్ డీఆర్డీవో మదన్‌మోహన్, పలువురు ఎంపీడీవోలు కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చూడాలి



మాట్లాడుతున్న దివాకర

జగిత్యాల: గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చూడాలని అదనపు కలెక్టర్ దివాకర అన్నారు. బుధవారం పంచాయతీ అధికారులతో కలెక్టరేట్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎండాకాలం గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు ఏర్పాటు చేయాలని, పైప్‌లైన్ లీకేజీలుగానీ, ఇతరత్రా పనులున్నా వెంటనే మరమ్మతు చేపట్టాలన్నారు. ఈనెల 25లోపు వందశాతం పన్ను వసూళ్లు చేపట్టాలన్నారు. నర్సరీల్లో లక్ష్యం మేరకు మొక్కలు పెంచాలని ఆదేశించారు. సమావేశంలో జెడ్పీ సీఈవో గౌతమ్‌రెడ్డి, డీఆర్డీఏ పీడీ సంపత్‌రావు, మిషన్ భగీరథ ఈఈ శేఖర్, డెప్యూటీ సీఈవో రఘువరణ్, పీఆర్ ఈఈ రహమాన్, దేవరాజ్ పాల్గొన్నారు.

రాయికల్ మున్సిపల్ కమిషనర్‌గా జగదీశ్వర్‌గౌడ్

రాయికల్: రాయికల్ మున్సిపల్ కమిషనర్‌గా జగదీశ్వర్‌గౌడ్‌ను నియమిస్తూ ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది. మెట్‌పల్లి కమిషనర్‌గా పనిచేస్తున్న జగదీశ్వర్‌గౌడ్‌ను రాయికల్‌కు బదిలీ చేశారు. రాయికల్‌లో పనిచేస్తున్న గంగుల సంతోష్‌కుమార్ నిజామాబాద్‌కు బదిలీ చేశారు.



ప్రత్యేక అలంకరణలో సరస్వతి అమ్మవారు



రాధాకృష్ణులకు 108 రకాల ప్రసాదాలు



సామూహిక అక్షరాభ్యాసంలో పాల్గొన్న భక్తులు



పూజలు చేస్తున్న డీఎంహెచ్ఓ శ్రీధర్



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

భక్తిశ్రద్ధలతో వసంతి పంచమి

మల్యాల/మెట్‌పల్లి రూరల్: వసంత పంచమి వేడుకలను జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. మల్యాల మండలం నూకపల్లిలోని శ్రీసరస్వతీ దేవాలఅమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేశారు. డీఎంహెచ్‌వో శ్రీధర్ కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. మెట్‌పల్లి మండలం చౌలమద్ది శివారులోని ఇస్కాన్ ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. ఆలయంలో అభిషేకం, మహాహారతి చేపట్టారు. రాధాకృష్ణులకు 108 రకాల ప్రసాదాలను నైవేద్యంగా సమర్పించారు.

అనుకున్నదే అయ్యింది..!

- జగిత్యాల మున్సిపల్ వైస్ చైర్మన్‌పై వీగిన అవిశ్వాసం
- సమావేశానికి హాజరుకాని కౌన్సిలర్లు
- వీగిపోయినట్లు ప్రకటించిన అధికారులు
- కౌన్సిలర్లలో 'ప్రత్యేకపాలన' భయం



మాట్లాడుతున్న ఆర్డీవో, కమిషనర్



జగిత్యాల మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు

జగిత్యాల: జగిత్యాల మున్సిపల్ వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌పై కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లే వైస్ చైర్మన్‌పై జనవరి 16న అవిశ్వాసం పెట్టారు. దీంతో కలెక్టర్ ఈనెల 14న ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు కౌన్సిలర్లకు నోటీసులు జారీ చేశారు. అనుకున్నట్లుగానే బుధవారం ఉదయం 11గంటలకు మున్సిపల్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఆర్డీవో నర్సింహమూర్తి, కమిషనర్ ముందుగానే చేరుకున్నారు. బల్దియాలో మొత్తం 48 స్థానాలకు ప్రస్తుతం 47 మంది సభ్యులు ఉన్నారు. వీరిలో కేవలం మొత్తం 10మంది కౌన్సిలర్లు హాజరయ్యారు. తీర్మానం నెగ్గాలంటే 32 మంది మద్దతు కావాలి. 10 మందే రావడంతో అవిశ్వాసం వీగిపోయినట్లు ఆర్డీవో నర్సింహమూర్తి ప్రకటించారు.

యూటర్న్ ఎందుకు..?

వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం ప్రకటించిన బీఆర్‌ఎస్ పార్టీ కౌన్సిలర్లు ఎందుకు యూటర్న్ తీసుకున్నారనేది స్థానికంగా చర్చనీయాంశమైంది. 28మంది బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టారు. ప్రత్యేక సమావేశానికి నెలరోజుల సమయం ఉండటంతో వివిధ రాజకీయ ప్రముఖులు చైర్మన్ లేనిదే వైస్ చైర్మన్ ఎన్నిక కాదని తెలపడంతో కౌన్సిలర్లు అంతర్మథనంలో పడ్డారు. దీంతోపాటు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ చొరవ తీసుకుని కౌన్సిలర్లతో తరచూ సమావేశమయ్యారు. ఒకవేళ వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం నెగ్గితే ప్రత్యేక అధికారి పాలన వచ్చే అవకాశం ఉంటుందని, ఇబ్బందులు ఉంటాయని వారికి నచ్చజెప్పారు. అధిష్టానం కూడా కౌన్సిలర్లకు ఎలాంటి అవిశ్వాసం పెట్టవద్దని ఆదేశించినట్లు తెలిసింది.

ఫలించిన వ్యూహం

ఒకవేళ వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం నెగ్గితే జరిగే పరిణామాలను దృష్టిలో పెట్టుకుని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ రమణ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు అందరూ ఎమ్మెల్సీ కవిత ఇంట్లో సమావేశమయ్యారు. అవిశ్వాసానికి పోవద్దని గట్టిగా ఆదేశించినట్లు తెలిసింది. ప్రతిఒక్కరికీ పదవులు వస్తాయని, నిరాశ చెందవద్దని, ప్రస్తుతం అధికారం లేదు కాబట్టి ఇలాంటి నిర్ణయాలు సరికాదని సూచించినట్లు తెలిసింది. దీంతో కౌన్సిలర్లు యూటర్న్ తీసుకున్నారు. అవిశ్వాసం వీగిపోవడంతో ప్రస్తుతం ఏం చేయాలోనని అధికార పార్టీల నేతలు ఆలోచనలో పడ్డారు.

మొదలైన క్యాంపులు

బల్దియా చైర్‌పర్సన్ పదవిని దక్కించుకునేందుకు ఇప్పటికే క్యాంపులు మొదలయ్యాయి. బీఆర్‌ఎస్ పార్టీ అత్యధికంగా 30 సీట్లు గెలుచుకోగా.. కాంగ్రెస్ 7, స్వతంత్రులు ఆరుగురు, బీజేపీ నుంచి ముగ్గురు, ఏఐఎఫ్‌బీ నుంచి ఒకరు, ఏఐఎంఐఎం నుంచి ఒకరు గెలుపొందారు. ప్రస్తుతం చైర్‌పర్సన్ సీటు ఖాళీ కావడంతో మళ్లీ పావులు మొదలుపెడుతున్నారు. ఇప్పటికే బీఆర్‌ఎస్ పార్టీ కౌన్సిలర్లు హైదరాబాద్‌లో మకాం వేశారు. రామోజీ ఫిల్మ్ సిటీలో క్యాంప్ రాజకీయాలు చేస్తున్నారు. చైర్‌పర్సన్ ఎన్నిక నిర్వహించాలని వారంలోపు నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉందని అధికారులు చెబుతుండడంతో ఆశావహులు ప్రయత్నాలు మొదలుపెట్టారు. గతంలో మున్నూరుకాపు సామాజిక వర్గానికి చెందిన సమిండ్ల వాణి, పద్మశాలీ వర్గానికి చెందిన అడువాల జ్యోతి, బండారు రజిని పోటీ పడినా బోగ శ్రావణికి దక్కింది. ప్రస్తుతం బండారు రజిని భర్త నరేందర్ చనిపోవడంతో ఆమె దాదాపుగా విరమించుకున్నట్లేనని సమాచారం. ఇక అత్యధిక కౌన్సిలర్లు సమిండ్ల వాణికి మద్దతు తెలుపుతున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీలు రమణ, కవిత ఆశీస్సులు ఎవరికి ఉంటే వారే చైర్మన్ కానున్నారు.

చైర్మన్ ఎన్నికపై ఆశలు

వైస్‌చైర్మన్‌పై అవిశ్వాసం వీగిపోవడంతో చైర్‌పర్సన్ ఎన్నికపై ఆశలు రేకెత్తుతున్నాయి. ఇప్పటికే మున్సిపల్ డైరెక్టర్ మున్సిపాలిటీల నుంచి ఎక్కడెక్కడ చైర్మన్/చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ పదవులు ఖాళీగా ఉన్నాయనే వివరాలు ఇవ్వాలన్న ఆదేశాల మేరకు జగిత్యాల బల్దియా చైర్‌పర్సన్ పోస్టు ఖాళీగా ఉన్నట్లు కమిషనర్ వివరాలు పంపించారు. గత ఎన్నికల్లో జగిత్యాల మున్సిపాలిటీ బీసీ జనరల్ మహిళకు రిజర్వేషన్ అయింది. దీంతో బీఆర్‌ఎస్ నుంచి పద్మశాలీవర్గానికి చెందిన బోగ శ్రావణిని చైర్‌పర్సన్ పదవి వరించింది. ఆమె 2023 జనవరి 25న చైర్‌పర్సన్‌తోపాటు కౌన్సిలర్ పదవికి కూడా రాజీనామా చేసిన విషయం తెల్సిందే. ఆ సమయంలో వైస్ చైర్మన్‌గా ఉన్న గోలి శ్రీనివాస్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. చైర్‌పర్సన్ ఎన్నిక జరపాలని ఎలక్షన్ కమిషన్ నోటిఫికేషన్ జారీ చేసినా.. శ్రావణి రాజీనామా చేసిన 37వ కౌన్సిలర్ స్థానం కూడా ఖాళీగా ఉండటంతో ముందుకెళ్లలేకపోయారు. తాజాగా చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నికలు నిర్వహించాలని, 10 శాతం కన్నా తక్కువ ఖాళీ స్థానాలుంటే చైర్మన్ ఎన్నిక చేసుకోవచ్చని ఉత్తర్వులు జారీ చేసింది. ఈ లెక్కన జగిత్యాలలో ఒక స్థానం మాత్రమే ఖాళీగా ఉండడంతో చైర్‌పర్సన్‌ను ఎన్నుకునే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

పత్తిపాక రిజర్వాయర్‌పై అసెంబ్లీలో 'అడ్లూరి' గళం



మాట్లాడుతున్న విప్ లక్ష్మణ్ కుమార్

గొల్లపల్లి/ధర్మపురి: ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు అసెంబ్లీలో సాగు, తాగు నీటి విషయంలో గత పాలకులు చేసిన అన్యాయంపై గళం విప్పారు. కాళేశ్వరం నీరు ధర్మపురి నియోజకవర్గంలోని నందిమేడారం రిజర్వాయర్ నుంచి సిరిసిల్ల, సిద్దిపేట గజ్వేల్‌కు నీరు తరలించుకుపోయారని, నియోజకవర్గానికి నీటి చుక్క ఇవ్వలేదని పేర్కొన్నారు. ఎస్సారెస్పీ వరద కాలువ ద్వారా నీరు రావడం తప్పితే ఎల్లంపల్లి, మేడారం రిజర్వాయర్ నుంచి రావడం లేదన్నారు. అప్పటి మంత్రి హరీశ్‌రావు ధర్మారం మండలం పత్తిపాక వద్ద రిజర్వాయర్ ఏర్పాటు చేస్తామని చెప్పినా నెరవేరలేదన్నారు. కాళేశ్వరం లింక్ -2 తీసుకొచ్చి రూ.20వేల కోట్లతో 1700 ఎకరాలను లాక్కున్నారని, అడ్డుపడితే తమపై 13 కేసులు పెట్టారని తెలిపారు.

కోరుట్ల మున్సిపల్ కమిషనర్‌గా తిరుపతి



కలెక్టర్‌ను కలిసిన తిరుపతి

కోరుట్ల: కోరుట్ల మున్సిపల్ కమిషనర్‌గా మున్సిపాల్టీలో రెవెన్యూ ఆఫీసర్‌గా విధులు నిర్వహించిన తిరుపతి పదోన్నతిపై నియమితులయ్యారు. బుధవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. అనంతరం కలెక్టర్ యాస్మిన్ బాషాను కలిసి ధన్యవాదాలు తెలిపారు.

ప్రేమికుల రోజే పెళ్లి

- మురిసిపోతున్న జంటలు
- పెళ్లితో ప్రేమకు పునాదులు
- ఒక్కరోజే 150 వివాహాలు



ప్రేమికుల రోజు పెళ్ల చేసుకున్న ఎఖీన్‌పూర్ జంట కమనీయ-శశాంక్

కోరుట్ల: ప్రేమ చిగురించి పెళ్లికి దారితీయం సహజం. అయితే పెద్దల అంగీకారంతో.. ఏడడుగుల బంధంతో ప్రేమికుల రోజున ఏకమైన జంటలు ప్రేమకు పునాదులు వేసుకోవడమే విశేషం. వాలెంటైన్స్ డే రోజు ఒకరిద్దరు కాదు.. జిల్లా వ్యాప్తంగా సుమారు 150 జంటలు పెళ్లితో ఏకమయ్యారు. పెద్దలు కుదిర్చిన సంబంధాలకు మంచి ముహూర్తం.. ప్రేమికుల రోజు కావడంతో బుధవారం పెళ్లి చేసుకున్న జంటలు తమకు ప్రేమికుల రోజు కలిసోచ్చిందని మురిసిపోతున్నాయి.

శుభ ముహూర్తం..వసంత పంచమి

దసరా, ఉగాది, వసంత పంచమి.. ఈ మూడు పండుగ రోజుల్లో ఎలాంటి ఘడియలు, ముహూర్తాలు, పంచాంగం చూడాల్సిన అవసరం లేకుండా పెళ్లి, గృహప్రవేశాలు, కొత్త ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేసుకోవడం చాలామంచిదని పురోహితులు చెబుతుంటారు. ఈ ఏడాది వసంత పంచమి, వాలెంటైన్స్ డే ఒకేరోజు రావడంతో అదే రోజు పెళ్లి చేసుకోవడానికి చాలామంది ముందుకొచ్చారు. ఫంక్షన్‌హాళ్లన్నీ పెళ్లిళ్లతో సందడిగా మారాయి. ఆర్టీసీ బస్సులు ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి.

మురిసిపోతున్న జంటలు

ఫిబ్రవరి 14న వాలెంటైన్స్ డే నిర్వహణకు.. పాశ్చాత్య ధోరణులకు స్వస్తి చెప్పాలన్న అభిప్రాయాలు ఎన్ని ఉన్నా.. ప్రేమికుల రోజున పెళ్లి చేసుకున్న జంటలు మాత్రం సంబరపడుతున్నాయి. ఓ వైపు శుభదినమైన వసంత పంచమి, మరో వైపు ప్రపంచ ప్రేమికుల రోజు కలిసిరావడం అదేరోజు పెళ్లి జరగడంతో తమ మధ్య అనురాగ బంధం మరింత దృఢంగా ఉంటుందన్న నమ్మకం వ్యక్తం చేస్తున్నారు. బుధవారం పెళ్లి చేసుకున్న వారిలో కొంతమంది ప్రేమికులు కూడా ఉండటం మరో విశేషంగా చెప్పవచ్చు. ప్రేమ పెళ్లికి దారితీయడమే కాదు.. సంప్రదాయంగా పెద్దలు కుదిర్చిన పెళ్లితో ప్రేమకు పునాదులు వేసుకోవచ్చని కొత్త జంటలు ఆకాంక్షిస్తున్నాయి.


హ్యాపీగా ఉంది



ప్రేమికుల రోజున పెళ్లి చేసుకోవడం కొత్త అనుభూతిని ఇచ్చింది. మా పెళ్లికి మంచి ముహూర్తం వసంత పంచమి కావడం.. అదేరోజు పెళ్లికి పెద్దలు నిశ్చయించడంతో ఎంతో సంబరపడ్డాం. పెద్దల ఆశీర్వాదంతో.. బంధుమిత్రుల శుభాభినందనలతో ఒక్కటయ్యాం.

– మనోహర్ – సహజ, మాదాపూర్, కోరుట్ల

ప్రేమకు పునాదులు



పెళ్లితో మా ప్రేమ చిగురించింది. ప్రేమికుల రోజున పెళ్లి మా బంధాన్ని మరింత దృఢంగా మారుస్తుంది. వాలెంటైన్స్ డే రోజు వచ్చినప్పుడల్లా మా పెళ్లి రోజు జరుపుకొనే అవకాశం రావడం కలిసొచ్చిన అవకాశం. ప్రతి వాలెంటైన్స్ డే రోజున పెళ్లితో కుదిరిన మా ప్రేమ మరింత ఎదుగుతుంది.

– సాయికిరణ్ – రవళి, గుండంపల్లి, మల్లాపూర్


అందరికీ సంబరాలే



సాధారణంగా ఎవరైనా ఏటా తమ పెళ్లి రోజును బంధుమిత్రులు.. శ్రేయోభిలాషులతో జరుపుకుంటారు. కానీ.. మా పెళ్లి రోజు దీనికి కాస్త విభిన్నం. పెద్దలు కుదిర్చిన మా పెళ్లి రోజున వాలెంటైన్స్ డే కావడంతో బంధుమిత్రులే కాదు..ఎక్కడ చూసినా వాలెంటైన్స్ డే సందడిగా ఉంటుంది. ఆ రోజున మా పెళ్లి జరగడం మాకు ఏటా కలిసొచ్చే అంశం.

– విదీష, నవీన్, మేడిపల్లి

జిల్లాలో ఆరు ఇసుక రీచ్‌లు



వెబ్‌సైట్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్, పాల్గొన్న అధికారులు

- ఇసుక వాహనం వెబ్‌సైట్ ప్రారంభం
- కలెక్టర్ యాస్మిన్ బాషా

జగిత్యాల: జిల్లావ్యాప్తంగా ఆరు ఇసుక రీచ్‌లు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ యాస్మిన్ బాషా తెలిపారు. ధర్మపురి మండలంలో రాజారం, ఆరెపల్లి, కోరుట్లలో పైడిమడుగు, రాయికల్ మండలంలో ఇటిక్యాల, జగన్నాథపూర్, మల్లాపూర్ మండలంలో సాతారం, మెట్‌పల్లి మండలంలో ఆత్మకూర్, కథలాపూర్ మండలంలో తక్కళ్లపల్లిలో ఇసుక రీచ్‌లు గుర్తించామని పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఇసుక వాహనం వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. ఇసుక అవసరమైన వారు TSMIV.CGG.GOV.IN ద్వారా ఇసుకను పొందవచ్చని, దూరాన్ని బట్టి ధర ఉంటుందని పేర్కొన్నారు. వినియోగదారుల కోసం హెల్ప్‌డెస్క్ నంబర్ 040–23120421 లో సంప్రదించాలని సూచించారు. ఇసుక వినియోగంలో ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు. అదనపు కలెక్టర్ దివాకర మాట్లాడుతూ.. గోదావరి పరీవాహక ప్రాంతాల్లోని ఇసుకను ప్రజల అవసరాలకు వినియోగించుకునేలా వెబ్‌సైట్ ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో సీసీజీ డైరెక్టర్ వైఎస్. గోపాలకృష్ణ, జెడ్పీ సీఈవో గౌతమ్‌రెడ్డి, డీఆర్డీఏ పీడీ సంపత్‌రావు, డెప్యూటీ సీఈవో రఘువరణ్, మైనింగ్ ఏడీ విజయ్‌కుమార్, డీపీవో దేవరాజ్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న మనోహర్‌రెడ్డి

జగిత్యాలరూరల్: మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని నాబార్డ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ మనోహర్‌రెడ్డి అన్నారు. జగిత్యాలరూరల్ మండలం లక్ష్మీపూర్‌లో నాబార్డ్, జనవికాస గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జ్యూట్ బ్యాగుల తయారీపై శిక్షణ పూర్తి చేసుకున్న 30 మంది స్వశక్తి మహిళలకు బుధవారం సర్టిఫికెట్లు, స్టైఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. పర్యావరణాన్ని పరిరక్షించేందుకు జ్యూట్ బ్యాగులు మేలు చేస్తాయన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి జ్యూట్ బ్యాగుల వినియోగాన్ని పెంచాలన్నారు. కార్యక్రమంలో డీఆర్డీవో సుధీర్, లీడ్ బ్యాంక్ మేనేజర్ వెంకట్‌రెడ్డి, జనవికాస గ్రామీణాభివృద్ధి సంస్థ కార్యదర్శి సంపత్‌కుమార్, ఏపీఎం గంగాధర్, సర్పంచ్ జాన్, ఎంపీటీసీ సునీత, టీజీబీ మేనేజర్ కార్తీక్, వీవోఏలు రాజ్యలక్ష్మీ, భాగ్యలక్ష్మీ, శిక్షకురాలు స్వప్న పాల్గొన్నారు.


క్లుప్తంగా

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



ధర్మపురి: మండలంలోని మగ్గిడి గురుకులం పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ రాజమణి తెలిపారు. ఈనెల 11న జగిత్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన సబ్ జూనియర్ జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఇందులో పాఠశాలకు చెందిన అవినాష్, రామ్‌తేజ రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. వీరు ఈనెల 16న నల్గొండలో జరిగే పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. విద్యార్థులను ప్రిన్సిపాల్, వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీనివాస్, సంతోష్ అభినందించారు.

మన్నెగూడెం హైస్కూల్లో క్షుద్రపూజల కలకలం



మేడిపల్లి: భీమారం మండలం మన్నెగూడెం హైస్కూల్లో క్షుద్రపూజల ఆనవాళ్లు కలకలం రేపాయి. ప్రధానోపాధ్యాయుడు మనోహర్‌రెడ్డి గది ముందు విచిత్రమైన బొమ్మల చిత్రాలు, పసుపు, కుంకుమ చల్లి ఉంది. దీంతో స్కూల్‌కు వెళ్లిన విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. స్థానికుల సమాచారంతో అక్కడికి చేరుకున్న పోలీసులు ఎవరో ఆకతాయిలు చేసి ఉంటారని, ఎవరూ భయాందోళనకు గురికావద్దని తెలిపారు. సంఘటనపై విచారణ చేపడతామన్నారు.

రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి–కూనారం మార్గంలోని రైల్వేగేటు సమీపంలో గుర్తు తెలియని 50 ఏళ్ల వయస్సు గల వ్యక్తి మృతదేహాన్ని కనుగొన్నట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ తిరుపతి తెలిపారు. సదరు వ్యక్తి గూడ్స్ రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడని, అతడి వద్ద ఎలాంటి గుర్తింపు కార్డులు లేవని వివరించారు. ఒంటిపై నీలిరంగు జీన్స్‌ప్యాంటు, తెలుపు రంగు ఫుల్‌షర్ట్ ధరించి ఉన్నట్లు తెలిపారు. మృతదేహాన్ని గోదావరిఖని మార్చురీలో భద్రపరిచామని, వివరాలు తెలిసినవారు 99493 04574, 87126 58604 నంబర్లలో సమాచారం ఇవ్వాలని కోరారు.

పూజారుల మొర కరుణించేనా..?

- కొత్త అర్చకులకు అందని వేతనాలు
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 898 ఆలయాలు
- ధూప, దీపం కింద 266 మంది ఎంపిక
- ఏడు నెలలుగా తప్పని ఎదురుచూపులు



గొల్లపల్లిలోని రామాలయం

గొల్లపల్లి: దేవాలయాల్లో నిత్యపూజల నిర్వహణకు ప్రభుత్వం తీసుకొచ్చిన ధూప, దీప, నైవేద్య (డీడీఎస్) పథకం లక్ష్యం నీరుగారిపోతోంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన ఆలయాల్లో అర్చకులకు ఏడు నెలలుగా వేతనాలు రావడం లేదు. దీంతో ఆలయాల్లో నిత్య పూజలు కొనసాగించేందుకు అర్చకులు అప్పు చేయాల్సిన దుస్థితి నెలకొంది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పురాతన ఆలయాల పునరుజ్జీవానికి ధూప, దీప, నైవేద్య పథకాన్ని తీసుకొచ్చింది. దేవాదాయ, ధర్మదాయ శాఖ ద్వారా రాష్ట్రంలో ఆలయాల అభివృద్ధితోపాటు ఎంపిక చేయబడిన డీడీఎస్ అర్చకులకు రూ.6వేల నుంచి రూ.10వేల వేతనాన్ని పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది.

898 ఆలయాలు గుర్తింపు..

వాస్తవానికి దేవాదాయ, ధర్మదాయ శాఖ 2009లోనే ధూప, దీప, నైవేద్య పథకాన్ని తీసుకొచ్చింది. అప్పట్లో అర్చకులకు నెలకు రూ.2500 వేతనంగా నిర్ణయించారు. రాష్ట్రం ఏర్పాటయ్యాక దానిని రూ.6వేలకు పెంచారు. ఇందులో రూ.4వేలు అర్చకుడి వేతనం, రూ.2వేలు పూజ సామగ్రికి కేటాయించాలి. గత కాంగ్రెస్ హయాంలో డీడీఎస్ పథకం కింద ఉమ్మడి కరీంగనర్ జిల్లాలో 450 ఆలయాలు ఉండగా.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చాక మరో 448 ఆలయాలు గుర్తించింది. కరీంనగర్ జిల్లాలో 258, జగిత్యాలలో 252, సిరిసిల్లలో 199, పెద్దపల్లిలో 197 ఆలయాలను గుర్తించి ధూప, దీప నైవేద్య పథకంలో చోటు కల్పించి నెలకు రూ.10 వేల చొప్పున ఇస్తామని ప్రకటించింది. ఎంపిక చేసి అర్చకులకు గతేడాది జూన్ 21న అప్పటి ఎమ్మెల్యేల చేతులమీదుగా ఉత్తర్వులు అందించింది. అప్పటి నుంచి ఆలయాల్లో పూజలు చేస్తున్నారు.

266 మంది ఎదురు చూపులు..

డీడీఎస్‌ఎస్‌లో చేరిన అర్చకులకు రూ.10 వేల వేతనాలు రావాల్సి ఉంది. పాత అర్చకులు 5నెలలకు సంబంధించి పెరిగిన రూ.10వేల వేతనాన్ని అందించారు. కొత్తగా ఈ పథకంలో చేరిన 266 ఆలయాల అర్చకులకు మాత్రం ఇప్పటికీ నిరాశే మిగిలింది. ఏడు నెలల నుంచి వేతనాలు రాకపోవడంతో అర్చకులు అవస్థలు పడుతున్నారు. కొత్త ప్రభుత్వంలో నైనా తమకు వేతనాలు అందుతాయన్న ఆశతో ఎదురుచూస్తున్నారు. తమకు వేతనాలు అందించాలని ఇటీవల దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు అర్చకులు వినతిపత్రం అందించారు.

ప్రతినెలా అందించాలి

అర్చకులకు ప్రతినెలా వేతనాలు అందించాలి. గతేడాది జూన్ 21న వీరిని ఎంపిక చేస్తూ ఉత్తర్వులు అందించినా వేతనం అందలేదు. ఈ పథకంలో మేం ఉన్నామా..? లేమా..? అనే సందేహం నెలకొంది. కొత్త ప్రభుత్వమైనా వేతనాలు విడుదల చేయాలి.

– నిట్టూరి సతీష్‌శర్మ, ధూపదీప నైవేద్య అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

త్వరలోనే అందుతాయి

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ధూపదీప నైవేద్య పథకంలో పాత, కొత్త అర్చకులకు సంబంధించిన వేతనాలను విడుదల చేయాలని ఉన్నతాధికారుల నివేదించాం. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కావాల్సి ఉంది. త్వరలో పాతవారితో పాటు కొత్తవారికీ వేతనాలు అందజేస్తాం.

– చంద్రశేఖర్, దేవాదాయ శాఖ ఉమ్మడి జిల్లా సహాయ కమిషనర్

వైద్యుల నిర్లక్ష్యం.. బాలింత మృతి

- పోలీసులకు ఫిర్యాదు.. కేసు నమోదు



మానస(ఫైల్)

జమ్మికుంట: వైద్యుల నిర్లక్ష్యం కారణంగా ప్రసవం కోసం వచ్చిన మహిళ ప్రాణాలు కోల్పోయింది. ఇద్దరు బిడ్డలను అనాథలుగా మారేలా చేసింది. ఎస్సై రాజేశ్ వివరాల ప్రకారం.. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం కనుకుల గ్రామానికి చెందిన జోంగోని మానస(27) రెండోకాన్పు ప్రసవం కోసం జమ్మికుంటలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చేరింది. ఆరోగ్య పరీక్షలు చేసిన వైద్యులు అనంతరం ఆపరేషన్ చేశారు. పండంటి బాబుకు జన్మనిచ్చింది. కొద్దిసేపటికి మానస ఆరోగ్య పరిస్థితి విషమించిందని, హనుమకొండలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి రెఫర్ చేశారు. అక్కడికి తీసుకెళ్లాక పరీక్షించిన వైద్యులు హైదరాబాద్ వెళ్లాలని సూచించారు. ప్రయివేటు అంబులెన్స్‌లో తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యలో చనిపోయింది. దీంతో



ఆసుపత్రి ఎదుట కుటుంబసభ్యుల ఆందోళన

జమ్మికుంటలోని ప్రయివేటు ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే మానస చనిపోయిందని కుటుంబసభ్యులు, బంధువులు మృతదేహాన్ని జమ్మికుంట తీసుకొచ్చారు. ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. జమ్మికుంట రూరల్ సీఐ కిషోర్, హుజూరాబాద్ రూరల్ సీఐ సంతోష్, వీణవంక ఎస్సై వంశీకృష్ణ, జమ్మికుంట ఎస్సై రాజేశ్ బందోబస్తు అక్కడికి చేరుకుని మృతురాలి కుటుంబసభ్యులతో మాట్లాడారు. ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు. మానస భర్త శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు ఆస్పత్రికి చెందిన ముగ్గురు వైద్యులపై కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

దోస్తును హతమార్చిన వ్యక్తి అరెస్టు

- బైక్ డబ్బులివ్వడంలో సతాయించాడని హత్య



కత్తి

వేములవాడ: స్నేహితుడిని హత్య చేసిన వేములవాడకు చెందిన కురుకుంట్ల బాబును వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. స్థానిక ఠాణాలో బుధవారం విలేకరులతో వివరాలు వెల్లడించారు. వేములవాడ పట్టణంలోని ఓల్డ్‌అర్బన్‌కాలనీకి చెందిన కురుకుంట్ల శ్రీధర్, కురుకుంట్ల బాబు స్నేహితులు. మూడేళ్ల క్రితం బాబు బైక్ కొనుక్కున్నాడు. ఇద్దరి మధ్యలో గొడవలు రావడంతో శ్రీధర్ తన స్నేహితుడు బాబు బైక్‌ను పెట్రోల్ పోసి నిప్పంటించాడు. దీంతో వీరి మధ్య వైరం పెరిగింది. అప్పటి నుంచి శ్రీధర్‌పై కక్ష పెంచుకున్న బాబు అవకాశం కోసం ఎదురుచూశాడు. బైక్ తగులబెట్టినందుకు రూ.లక్ష చెల్లించేందుకు ఒప్పుకొని, రూ.50వేలు చెల్లించాడు. మిగతా డబ్బుల కోసం శ్రీధర్ ఇవ్వకపోగా.. తోటి స్నేహితుల ముందు బాబును చులకనభావంతో మాట్లాడేవాడు. ఈక్రమంలోనే బాబు ముంబైకి



బాబును అరెస్టు చూపిస్తున్న డీఎస్పీ

వెళ్లి పది రోజుల క్రితం వేములవాడకు వచ్చాడు. శ్రీధర్ కించపరిచేలా మాట్లాడుతుండడంతో విసిపోయిన బాబు తన మిత్రుడిని చంపేయాలని నిర్ణయించుకున్నాడు. ఈనెల 11వ తేదీ రాత్రి 10.45 గంటల ప్రాంతంలో శ్రీధర్ ఇంటికెళ్లి బయటకు వెళ్దామని బైక్‌పై తీసుకెళ్లాడు. రెండో బైపాస్ పక్కన గల జర్మనీ గెస్టహౌస్ సమీపంలోని ఖాళీ స్థలంలోకి తీసుకెళ్లాడు. శ్రీధర్‌కు ఫుల్లుగా మద్యం తాగించి, తన వెంట తెచ్చుకున్న కత్తితో గొంతు కోసి హతమార్చాడు. అక్కడి నుంచి శ్రీధర్ బండిపైనే బాబు పరారయ్యాడు. స్థానిక శివపార్వతులకాలనీ పక్కన గల నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్‌రూమ్‌ల వద్ద బాబును అరెస్టు చేశారు. హత్యకు ఉపయోగించిన కత్తి, బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ వివరించారు. సమావేశంలో వేములవాడటౌన్ సీఐ కరుణాకర్, ఎస్సై అంజయ్య, ఏఎస్సై బేగ్ పాల్గొన్నారు.

పార్ట్‌టైం జాబ్ పేరుతో రూ.91,991 స్వాహా

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని అరవింద్ నగర్‌కు చెందిన వేముల అనిల్‌కుమార్‌ను సైబర్ నేరగాళ్లు పార్ట్‌టైం జాబ్ పేరుతో మోసం చేశారు. అనిల్‌కుమార్‌కు సైబర్‌నేరగాళ్లు ఈనెల 3న టెలిగ్రామ్‌లో పార్ట్‌టైం జాబ్ ఉందని ఓ లింక్ పంపించారు. ఆ లింక్ ద్వారా సంప్రదించగా సైబర్ నేరగాళ్లు రూ.10 వేలు డిపాజిట్ చెల్లించాలని సూచించడంతో వారికి ఆన్‌లైన్‌లో ట్రాన్స్‌ఫర్ చేశాడు. అలాగే సైబర్ నేరగాళ్లు ఐదుసార్లు కలిపి మొత్తం రూ.91,991 వారి ఖాతాలోకి బదిలీ చేయించుకుని మోసానికి పాల్పడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రహ్మత్‌పురలో..

జగిత్యాల పట్టణంలోని రహ్మత్‌పురకు చెందిన ఎండీ.షాబుద్దీన్‌ను సైబర్ నేరగాళ్లు ప్యాకింగ్ పేరుతో మోసం చేశారు. షాబుద్దీన్ ఫోన్‌కు కొద్ది రోజుల క్రితం నటరాజ్ పెన్సిల్ ప్యాకింగ్ పేరుతో ఓ యాడ్ రాగా.. ఆ నంబరును సంప్రదించాడు. మొదట కొంత నగదు చెల్లించాలని చెప్పడంతో ఆన్‌లైన్‌లో ట్రాన్స్‌ఫర్ చేశాడు. ఇలా మూడు దఫాల్లో రూ.6,950 చెల్లించాడు. తిరిగి ఫోన్ చేస్తే సైబర్ నేరగాళ్లు ఫోన్ స్విచ్ఛాఫ్ చేశారు. మోసపోయినట్లు గుర్తించి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

కిక్ బాక్సింగ్‌లో ప్రతిభ

వీణవంక: మండలంలోని చల్లూరు గ్రామానికి చెందిన కొమ్ము యువరాజ్ వాకో ఇండియా ఇంటర్‌నేషనల్ ఓపెన్ కిక్ బాక్సింగ్ టోర్నమెంట్‌లో సత్తా చాటాడు. ఈ నెల 7నుంచి 11వరకు ఢిల్లీలో జరిగిన టోర్నీలో అండర్–12విభాగంలో నాన్‌చాక్ కటాలో గోల్డ్ మెడల్ సాధించాడు., హ్యాండ్ కటాలో బ్రాంజ్ మెడల్, 37కిలోల విభాగంలో పాయింట్ ఫైల్‌బ్రాంజ్ మెడల్, లైవ్ కాంటాక్ట్‌లో బ్రాంజ్ మెడల్ సాధించాడు. గ్రామీణ ప్రాంతం నుంచి జాతీయ స్థాయిలో రాణించడంపై యువరాజ్‌ను గ్రామస్తులు అభినందించారు.

గంజాయి పట్టివేత.. నలుగురి రిమాండ్

మానకొండూర్: అక్రమంగా రవాణా చేస్తున్న గంజాయిని పట్టుకున్న మానకొండూర్ పోలీసులు ముగ్గురిని అరెస్టు చేశారు. వారినుంచి 1.200 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సీఐ రాజ్‌కుమార్ వివరాల ప్రకారం.. మానకొండూర్ మండలకేంద్రంలోని చెరువుకట్ట వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఓ వాహనంపై ముగ్గురు యువకులు అనుమానాస్పదంగా కనిపించారు. వారినుంచి 1.200 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన వారిలో జగ్గయ్యపల్లి గ్రామానికి చెందిన వ్యాట అనిల్‌రెడ్డి(22), లింగాపూర్‌కు చెందిన ఏకుల భరత్(20), మానకొండూర్‌కు చెందిన షేక్ ఇస్మాయిల్(19) ఉన్నారు.

పార్క్‌లో న్యూసెన్స్.. 13మందిపై కేసు

కరీంనగర్ క్రైం: కరీంనగర్ డీర్‌పార్క్‌కు వెళ్లిన యువతీయువకులను బెదిరించిన 13మందిపై ఫారెస్టు అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. కరీంనగర్‌లోని మానేరు డ్యాం సమీపంలో ఉన్న డీర్‌పార్క్‌కు 13మంది యువకులు విశ్వహిందూ పరిషత్ కండువాలు ధరించి వెళ్లారు. ప్రేమికుల దినోత్సవం జరుపుకోవద్దంటూ నినాదాలు చేశారు. పార్క్‌లోకి వెళ్లిన యువతీ, యువకులను ఫొటో, వీడియోలు తీస్తూ బెదిరింపులకు గురిచేశారు. ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ విక్కిమార్టిన్ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఇంగ్లిష్ సబ్జెక్ట్‌లో ప్రాక్టికల్స్

జగిత్యాల: ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఇంగ్లిష్ సబ్జెక్ట్‌లో ప్రాక్టికల్స్ నిర్వహించనున్నట్లు ఇంటర్మీడియెట్ నోడల్ అధికారి నారాయణ తెలిపారు. జిల్లాలోని 74 కళాశాలల్లో ఈనెల 16న ఉదయం తొమ్మిది గంటల నుంచి నిర్వహిస్తామని పేర్కొన్నారు. హాల్‌టికెట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ పరీక్షల్లో ఉత్తీర్ణులైతేనే ఇంటర్ పాస్ సర్టిఫికెట్ పొందేందుకు అర్హులని పేర్కొన్నారు.

నేడు ఉద్యోగ మేళా

జగిత్యాల: ఇంటర్ విద్యార్థులకు కలెక్టర్ ఆధ్వర్యంలో ఈనెల 15న ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు ఇంటర్మీడియెట్ నోడల్ అధికారి నారాయణ తెలిపారు. హెచ్‌సీఎల్ టెక్నాలజీ వారు నిర్వహిస్తున్న టెక్‌బీ ప్రోగ్రాం కోసం ఇంటర్ పూర్తి చేసుకున్న విద్యార్థులు హాజరు కావచ్చన్నారు. జిల్లాలోని ప్రభుత్వ రంగ, ప్రైవేటు కళాశాలల్లో ఎంపీసీ, ఎంఈసీలో 75 శాతం, మ్యాథ్స్‌లో 60 శాతం మార్కులు పొందిన అభ్యర్థులు అర్హులన్నారు. పూర్తి వివరాలకు హెచ్‌సీఎల్ ప్రతినిధి 75691 77071నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

జగిత్యాల డీసీఆర్బీ డీఎస్పీ బదిలీ

జగిత్యాలక్రైం: జగిత్యాల డీసీఆర్బీ డీఎస్పీ వి.సురేశ్‌ను బదిలీ చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆయన మహబూబాబాద్ జిల్లా తొర్రూర్‌కు బదిలీ అయ్యారు. జగిత్యాల డీఎస్పీగా పనిచేసిన వెంకటస్వామిని రెండు రోజుల క్రితం డీఐజీ కార్యాలయానికి అటాచ్ చేయగా.. బుధవారం రామగుండం సీసీఎస్ ఏసీపీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

17న రౌండ్‌టేబుల్ సమావేశం

కోరుట్ల: ఈనెల 17న హైదరాబాద్‌లో తెలంగాణ ఉద్యమకారుల రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నామని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు పేట భాస్కర్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అలుపెరగని పోరాటం చేసిన ఉద్యమకారులతో కలిసి హైదరాబాద్‌లోని సెంట్రల్‌కోర్టు హోటల్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. గత ప్రభుత్వం ఉద్యమకారులను విస్మరించి వ్యతిరేకులను అందలం ఎక్కించిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులను ఆదుకుంటామని, ఇంటి స్థలాలు, ఇళ్ల నిర్మాణాలు చేయిస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. రౌండ్ టేబుల్ సమావేశంలో టీపీఎస్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ గజ్జెల కాంతం పాల్గొంటారని పేర్కొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

మంథని: మంథని–పెద్దపల్లి ప్రధాన రహదారిలోని కూచిరాజ్‌పల్లి వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బూడిద సమ్మయ్య తీవ్రంగా గాయపడ్డాడు. కూచిరాజ్‌పల్లికి చెందిన సమ్మయ్య నడుచుకుంటూ వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. మంథని సామాజిక వైద్యశాలలో ప్రథమ చికిత్స అందించగా, పరిస్థితి విషమంగా ఉండడంతో కరీంనగర్ తరలించారు.

అతివేగం.. అజాగ్రత్తతోనే ప్రమాదాలు



ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్పీ



ర్యాలీలో పాల్గొన్న ఎస్పీ

- రోడ్డు ప్రమాదాలు నివారించాలి
- ప్రజలు భాగస్వామ్యం కావాలి
- ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ వెల్లడి

జగిత్యాలక్రైం: అతివేగం, అజాగ్రత్తతోనే రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ అన్నారు. బుధవారం జిల్లాకేంద్రంలోని ఓల్డ్ బస్టాండ్‌లో హెల్మెట్ అవగాహన ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్రాఫిక్ నియమాలు పాటించాలని, వాహనాల వేగాన్ని నియంత్రించాలని, అప్పుడే రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయని తెలిపారు. ఇందుకు ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా నెల రోజులుగా జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో హెల్మెట్ ఆవశ్యకత, సీట్ బెల్ట్ ధరించడం, మొబైల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం, డ్రంక్‌అండ్ డ్రైవ్, ఓవర్ స్పీడింగ్, డేంజరస్ డ్రైవింగ్, గూడ్స్ వెహికల్ క్యారింగ్ ప్యాసింజర్, సిగ్నల్ జంపింగ్ చేయడం, ఓవర్ టేక్ చేయడం వంటిపై 110కుపైగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. భారీ వాహనలైన లారీ, ట్రాక్టర్, టిప్పర్ వంటి వాహనాలకు వెనుక వైపున రేడియం స్టిక్కర్ అతికించామన్నారు. ట్రాఫిక్ నియమాలపై విద్యార్థులకు అవగాహన కల్పించామన్నారు. ప్రమాదాల నివారణకు జిల్లాస్థాయిలో ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారి ఆధ్వర్యంలో సేఫ్టీ బ్యూరోను ప్రారంభిస్తామన్నారు.

తరుచూ రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను పరిశీలించి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై నివేదిక అందిసారని తెలిపారు. పోలీస్ శాఖ తీసుకుంటున్న చర్యలతో 2022తో పోలిస్తే 2023లో తగ్గాయన్నారు. వాహనదారులకు హెల్మెట్‌లను ఇవ్వడంతోపాటు, ట్రాఫిక్ నియమాలకు సంబంధించిన పోస్టర్, కరపత్రాలు, ఆవిష్కరించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ప్రభాకరరావు, డీఎస్పీ రఘుచందర్, సీఐలు నటేశ్, రఫీఖాన్, ట్రాఫిక్ ఎస్సై రామచంద్రం, ఎన్జీవో గన్‌శ్యామ్ ఓజా, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా సంఘాల చేతికి యూనిఫాంల తయారీ

- ఆదేశాలు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- జిల్లాలో విద్యార్థుల సంఖ్య సేకరణ పూర్తి
- 1,144 మంది మహిళాసభ్యులకు లబ్ధి



మహిళా సంఘాల సమావేశం

మండల సమైక్యలు	18
గ్రామ సమైక్యలు	565
స్వశక్తి సంఘాలు	14,957
మహిళా సంఘ సభ్యులు	1,72,801

జగిత్యాలరూరల్: రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాలను ఆదాయ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేలా ప్రోత్సహించడమే కాకుండా.. వారికి నిత్యం పని ఉండేలా ప్రణాళికలు రూపొందిస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఏటా ఇచ్చే యూనిఫాంల తయారీని ప్రస్తుతం మహిళా సంఘాలకు అప్పగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. దీంతో జిల్లా అధికారులు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను సేకరించారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా వారి దుస్తుల తయారీని మహిళా సంఘాలకు అప్పగించనున్నారు.

1,144 మంది మహిళలకు ఉపాధి

జిల్లాలో గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో పాఠశాల యూనిఫాంల తయారీ బాధ్యత ప్రభుత్వం అప్పగించింది. జిల్లాలో మహిళాసంఘాలలో ఇప్పటికే కుట్టుశిక్షణ పొంది దుస్తుల తయారీలో నిపుణులైన వారి జాబితాను తయారుచేశారు. జిల్లాలో 1,144 మంది మహిళలు దుస్తులు కుట్టేలా శిక్షణ పొంది ఉన్నారు. ఇందులో కుట్టుమిషన్ ఉన్నవారు 1,106 మంది ఉన్నారు. మరో 38 మందికి కుట్టుమిషన్లు లేవు. దుస్తుల కటింగ్, 910 మంది మహిళలు కటింగ్ చేసేలా నైపుణ్యం ఉంది. 234 మంది కుట్టడంలో నిపుణులై ఉన్నారు. వీరు ప్రతిరోజు సుమారు 4,121 డ్రెస్‌లు కుట్టే అవకాశం ఉంది. పాఠశాల పునఃప్రారంభం నాటికి ప్రతి విద్యార్థికి యూనిఫాం అందేలా చర్యలు చేపడుతున్నారు.

783 పాఠశాల విద్యార్థులకు యూనిఫాంలు

జిల్లాలో 783 పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం మహిళా సంఘాల ద్వారా యూనిఫాంలు కుట్టించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. 783 పాఠశాలల్లో బాలురు 28,405 మంది, బాలికలు 26,848 మంది ఉన్నారు. మొత్తం 55,523 మంది విద్యార్థులకు యూనిఫాంలు మహిళా సంఘాల ద్వారా కుట్టించనున్నారు.

ధర్మపురిలో బాలిక మిస్సింగ్

ధర్మపురి: పట్టణానికి చెందిన ఓ బాలిక ఈనెల 12న అదృశ్యమైనట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రాత్రి ఏడు గంటల ప్రాంతంలో బయటకు వెళ్లిన బాలిక ఇంటికి రాలేదు. దీంతో మరుసటి రోజు బాలిక తండ్రి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసుగా పోలీసులు నమోదు చేశారు. ఇటీవల ధర్మపురిలో ఓ బాలిక లైంగిక దాడికి గురైన ఘటన మరువకముందే తాజాగా మరో బాలిక మిస్సింగ్ కావడం చర్చనీయాంశంగా మారింది. బాలిక మిస్సింగ్ అయిందా..? లేక గుర్తు తెలియని వ్యక్తులు కిడ్నాప్ చేశారా..? అనే అనుమానాలు కూడా వినిపిస్తున్నాయి. పోలీసులు మాత్రం ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు.

సమ్మోహనం.. శతగళార్చన



శత గళార్చనలో సంగీత విద్వాంసులు



శత గళార్చనలో పాల్గొన్న చిన్నారులు

- 130 మంది గాయకులతో అన్నమయ్య కీర్తనలు
- మార్మోగిన శ్రీవేంకటేశ్వరాలయం

కోరుట్ల: కోరుట్ల పట్టణంలోని శ్రీవేంకటేశ్వర ఆలయంలో బుధవారం కర్ణాటక సంగీత శైలిలో 130 మంది కళాకారులతో నిర్వహించిన శతగళార్చన ఆహూతులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా కర్ణాటక సంగీత పాఠశాల నిజామాబాద్ అధ్యక్షురాలు స్వప్నరాణి మాట్లాడుతూ సామవేదం నుంచి ఉద్భవించిన కర్ణాటక సంగీతం దక్షిణ భారతదేశంలోని అనేక ప్రాంతాల్లో ప్రాచుర్యం పొందిందన్నారు. సంగీతంపై రోజురోజుకూ అభిరుచి పెరుగుతున్న క్రమంలో 130 మంది గాయకులతో శతగళార్చన నిర్వహించి.. ఏకకాలంలో అన్నమయ్య కీర్తనలను శ్రుతిబద్ధంగా ఆలపించామని పేర్కొన్నారు. 'కొండలలో నెలకొన్న కోనేటి రాయుడు వాడు..' అన్న కీర్తనతో మొదలై 'అదివో..అల్లదివో శ్రీహరివాసమూ..' కీర్తనతో శత గళార్చన ముగించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య, వాంగ్మయ శిక్షకురాలు గిన్నెల స్వాతి, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షులు అన్నం అనిల్, ఆర్యవైశ్య సంఘం నాయకులు కొత్త సురేష్, బీజేపీ నాయకులు ఇందూరి సత్యం, బాలే నర్సయ్య, గిన్నెల శ్రీకాంత్ లు పాల్గొన్నారు.

ఉత్సవమూర్తుల ఊరేగింపు



ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి ప్రధాన ఆలయంతోపాటు అనుబంధ దేవాలయాల్లో బుధవారం వంసత పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా తీసుకెళ్లి స్థానిక ఇసుక స్తంభం వద్దనున్న భోగ మండపంలో ఆశీనులు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కార్యక్రమంలో డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, రేనవేషన్ కమిటీ చైర్మన్ రామన్న, సభ్యులు తదితరులున్నారు. స్థానిక వాణి విద్యాలయంలో వసంత పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అక్షరాభ్యాస మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమలో కరస్పాండెంట్ గట్ల శ్రీనివాస్, ప్రిన్సిపాల్ సంగనభట్ల సంతోషి, డైరెక్టర్లు దినేష్, తోట శంకర్ తదితరులున్నారు.